సాక్షి
మహబూబ్‌నగర్
సోమవారం । 22 । ఏప్రిల్ । 2024



గిరిజనుల ఆరాధ్యుడు

గిరిజనుల ఆరాధ్యదైవం బావోజీ ఉత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి.

వివరాలు 8లో ▸



భారీగా నగదు పట్టివేత

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా చేపడుతున్న తనిఖీల్లో మద్యం, నగదు పట్టుబడింది.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
43.5 /21.8

వాతావరణం

ఉదయం, మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై ఉన్నా ఉక్కపోత ఉంటుంది. మధ్యాహ్నం నుంచి ఎండ తీవ్రత పెరుగుతుంది.

పోలేపల్లిలో భూ బాగోతం

ప్రభుత్వ, అసైన్డ్, భూదాన్ భూములు సైతం మాయం

- తప్పుడు రిజిస్ట్రేషన్లతో ఆక్రమణల పర్వం
- రియల్ భూంతో రూ.కోట్లు పలుకుతున్న ధరలు
- ఇదే అదునుగా చెలరేగుతున్న అక్రమార్కులు



పోలేపల్లి పరిధిలో వివాదాస్పదంగా మారిన భూమి

జడ్చర్ల: పోలేపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో భూ బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. పోలేపల్లి శివారులో సెజ్ (ప్రత్యేక ఆర్థిక మండలి) ఏర్పాటుతో ఒక్కసారిగా చుట్టుపక్కల గల భూముల ధరలకు రెక్కలొచ్చాయి. అంతేగాక 44వ నంబర్ జాతీయ రహదారిని అనుసరించి ఉండటంతోపాటు పారిశ్రామికంగా దినదినాభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో ఎకరా ధర రూ.5–10 కోట్లు పలుకుతోంది. దీంతో అక్రమార్కులు ప్రభుత్వ భూములను తప్పుడు ధ్రువపత్రాలతో దక్కించుకుని రూ.కోట్లు గడిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన రికార్డులను సైతం మార్పులు, చేర్పులు చేసి భూమాయ చేస్తున్నారు. ఫలితంగా అసలు ప్రభుత్వ భూములు ఎక్కడెక్కడ.. ఎంతెంత.. ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. రెవెన్యూ అధికారులు ఆయా భూములపై దృష్టిసారించకపోవడంతో అక్రమార్కులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది.

జాడలేని ప్రభుత్వ భూములు

రెవెన్యూ రికార్డుల ప్రకారం పోలేపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో మొత్తం 1,106.21 ఎకరాల భూమి ఉంది. ఇందులో ప్రభుత్వ భూమి 431.01 ఎకరాలు కాగా.. శిఖం భూమి 217.03 ఎకరాలు, భూదాన్ భూమి 101.15 ఎకరాలు, సీలింగ్ భూమి 79.10 ఎకరాలు, టీఎస్‌ఐఐసీకి కేటాయించిన భూమి 294.11 ఎకరాలు. అయితే టీఎస్‌ఐఐసీకి కేటాయించింది మినహా ఇతర ప్రభుత్వ భూములు ఎక్కడున్నాయో తెలియడం లేదు. ఆయా భూములను గుర్తించి వాటిని కాపాడాల్సిన సంబంధిత అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. కాగా కొందరు అక్రమార్కులు ఆయా భూములను తప్పుడు రిజిస్ట్రేషన్లతో క్రయవిక్రయాలు జరపడంతో ప్రస్తుతం ప్రభుత్వ భూముల జాడ లేకుండాపోతోంది.

ఆలయాల భూములు సైతం

శతాబ్దాల చరిత్ర కలిగిన ఆలయాల భూములు సైతం మాయమయ్యాయి. జడ్చర్ల శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ భూములు మొత్తం వెంచర్లుగా మారి కాలనీలు వెలిశాయంటే పరిస్థితిని ఊహించవచ్చు. అలాగే మిడ్జిల్ మండలం వెలుగొమ్ముల శ్రీచెన్నకేశవస్వామి ఆలయ భూములూ అన్యాక్రాంతమయ్యాయి. పలుచోట్ల వక్ఫ్ భూములు కూడా అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆయా భూములను కాపాడేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వివాదాస్పదంగా మిగులు భూమి

పోలేపల్లి శివారులో సర్వే నంబర్లు 510, 511, 512లను ఆనుకుని ప్రభుత్వ మిగులు భూమి 18 ఎకరాలు ఉందని గ్రామస్తులు తెలిపారు. అయితే ఆయా సర్వే నంబర్లకు 510/అ1,511/2, 512/3గా బై నంబర్లు వేసి తప్పుడు రిజిస్ట్రేషన్లు చేసి ఆక్రమణకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బై నంబర్లకు సంబంధించి ధరణిలో ఎలాంటి ఆధారాలు లేవని, అయినా సదరు భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని వాపోతున్నారు.

ప్రభుత్వ మిగులు భూమిగా భావిస్తున్న పొలం చుట్టూ కంచె ఏర్పాటుకు సిద్ధం చేసిన కడీలు →



ఎమ్మెల్యే ఆగ్రహం

పోలేపల్లి పరిధిలో ప్రభుత్వ మిగులు భూములను కొందరు తప్పుడు ధ్రువపత్రాలతో క్రయవిక్రయాలు జరిపారని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆరోపించారు. ఆయా భూములను స్వాధీనం చేసుకుని గ్రామంలోని పేదలకు సంబంధించి ప్లాట్లు పంపిణీ చేస్తామన్నారు. ఈ విషయంలో తాను చిత్తశుద్ధిని కనబరుస్తానని స్పష్టం చేశారు.

హైకోర్టుకు వెళ్లాం..



పోలేపల్లి శివారులోని ప్రభుత్వ మిగులు భూమిని కొందరు అక్రమార్కులు బైనంబర్లు వేసి ఇతరులకు విక్రయించారు. ఈ విషయమై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో హైకోర్టును ఆశ్రయించగా.. నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించింది. ప్రభుత్వ పెద్దలు మిగులు భూమిని కాపాడి గ్రామ అవసరాలకు కేటాయించాలి.

– చిన్న మల్లయ్య, పోలేపల్లి

పాస్ బుక్‌లు రాలేదు..



కర్వెన రిజర్వాయర్ పరిధిలో గల మా భూమిని ప్రభుత్వం తీసుకుని నష్టపరిహారం ఇవ్వడంతో ఆ డబ్బులు పెట్టి పోలేపల్లి శివారులో భూమిని కొనుగోలు చేశాం. ఇందుకు సంబంధించి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిష్టర్ చేసుకున్నాం. అయితే ధరణి రావడంతో ఇప్పటి వరకు తమకు డిజిటల్ పాస్ బుక్‌లు రాలేదు. వాటి కోసమే అధికారుల చుట్టూ తిరుగుతున్నాం.

– ఉద్యానాయక్, రైతు, పుల్లగిరి

మా దృష్టికి రాలేదు



పోలేపల్లి పరిధిలో ప్రభుత్వ మిగులు భూములు ఉన్నట్లు మా దృష్టికి రాలేదు. ప్రభుత్వ భూములను ఆక్రమించడం చట్టరీత్యా నేరం. ప్రభుత్వ భూములు, అసైన్డ్, భూదాన్ భూముల ఆక్రమణకు గురైనట్లు మా దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటాం.

– సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్, జడ్చర్ల

గోల్‌మాల్ ఇలా..

పోలేపల్లి పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను సర్వే చేసి ఎక్కడికక్కడ వాటికి హద్దు రాళ్లను పాతి రక్షణ చర్యలు చేపట్టాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉంది. ఇక్కడ భూముల గోల్‌మాల్ వ్యవహారం భారీగానే నడిచినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి ప్రత్యేకంగా పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి పూర్తిస్థాయిలో పట్టా భూములతో పాటు ప్రభుత్వ భూములను సైతం సర్వే చేస్తే వాస్తవంగా ఎంత భూమి ఉందో తెలుస్తుంది. దీంతో అక్రమార్కుల చేతుల్లోకి ప్రభుత్వ భూములు ఎలా వెళ్లావో కూడా బయటపడతాయని.. ఆ దిశగా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చలో.. సలేశ్వరం



హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిలోని ఫర్హాబాద్ చౌరస్తా.. సలేశ్వర క్షేత్రం వెళ్లే మార్గం

తెలంగాణ అమర్‌నాథ్ యాత్రగా ప్రసిద్ధి

- నేటినుంచి ఉత్సవాలు.. పౌర్ణమి రోజు లక్ష మందికిపైగా హాజరు
- జాతరకు అటవీశాఖ నుంచి తప్పని ఆంక్షలు
- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకే అనుమతి
- ఐదురోజుల నుంచి మూడు రోజులకు కుదింపు

అచ్చంపేట: ఎత్తైన కొండలు.. జాలువారే జలపాతం.. ప్రకృతి రమణీయతకు అద్దం పట్టే నల్లమల అటవీ ప్రాంతంలో కొలువుదీరిన సలేశ్వరం లింగమయ్యను దర్శించుకోవాలంటే ఎంతో సాహసం చేయాల్సిందే. రాళ్లు.. రప్పలతో కూడిన దారిలో కిలోమీటర్ల మేర కాలినడకన.. కొండలు ఎక్కి దిగుతూ.. పున్నమి వెన్నెల్లో స్వామి సన్నిధికి చేరుకోవాల్సి ఉంటుంది. లోయలో ప్రతిధ్వనించే లింగమయ్య నామస్మరణ.. దారి పొడవునా పడే నీటి తుంపర్లు.. వెయ్యి అడుగులపై నుంచి జాలువారే జలపాతం.. ఇలా ఒక్కో దృశ్యం ఒక్కో అద్భుతం. ఒక్కసారి ఈ యాత్ర చేస్తే జీవితాంతం గుర్తుండిపోతుంది. తెలంగాణ అమర్‌నాథ్ యాత్రగా ప్రసిద్ధిగాంచిన సలేశ్వరం జాతర సోమవారం నుంచి ప్రారంభం కానుంది.

మహత్తర ఘట్టం

సలేశ్వరం లింగమయ్య దర్శనం ఓ మహత్తర ఘట్టం. పేద, ధనిక.. చిన్నా, పెద్ద.. ముసలి, ముతక.. ఇలా ఎవరైనా సరే ప్రమాదభరితమైన కొండల్లో కాలినడకన గంటల తరబడి నడిచి వెళ్లాల్సిందే. దర్శనానికి వెళ్లే ముందు 'వస్తున్నాం.. లింగమయ్యా' తిరిగి వచ్చేటప్పుడు 'వెళ్లొస్తాం.. లింగమయ్యా' అంటూ భక్తి పారవశ్యంతో ప్రణమిల్లుతారు. ప్రతిఏటా ఏప్రిల్‌లో వచ్చే చైత్ర పౌర్ణమి సందర్భంగా సలేశ్వరం జాతర జరుగుతుంది. గతేడాది నుంచి అటవీశాఖ ఆంక్షలు విధించి ఐదురోజుల జాతరను మూడు రోజులకు కుదించి రాత్రివేళ అనుమతించడం లేదు. ఈసారి కూడా సోమవారం నుంచి బుధవారం అనుమతిస్తున్నట్లు అటవీశాఖ వెల్లడించింది. అది కూడా ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకే దర్శనానికి వెళ్లాల్సి ఉంటుంది.

ఇలా చేరుకోవాలి..

హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారి-765లోని మన్ననూర్ అనంతరం ఫర్హాబాద్ చౌరస్తా వస్తుంది. ఇక్కడి 157 మైలురాయి వద్ద ఉంటుంది. శ్రీశైలం వైపు నుంచి వచ్చేవారు దోమలపెంట, వటువర్లపల్లి మీదుగా ఫర్హాబాద్ చౌరస్తాకు చేరుకోవాలి. నల్లగొండ నుంచి వచ్చేవారు మల్లేపల్లి, దేవరకొండ, డిండి నుంచి హాజీపూర్ చౌరస్తా చేరుకోవాలి. మిర్యాలగూడ నుంచి వచ్చే భక్తులు అంగడిపేట, పెద్దఊర, మల్లేపల్లి, దేవరకొండ, డిండి మీదుగా హాజీపూర్ చౌరస్తా, మన్ననూర్ మీదుగా ఫర్హాబాద్ వెళ్లాల్సి ఉంటుంది. ఫర్హాబాద్ చౌరస్తా హైదరాబాద్ నుంచి 157 కి.మీ., మహబూబ్‌నగర్ నుంచి 131 కి.మీ., నల్లగొండ నుంచి 141 కి.మీ., అచ్చంపేట నుంచి 38 కి.మీ., మన్ననూర్ నుంచి 18 కి.మీ., దూరంలో ఉంటుంది. ఫర్హాబాద్ చౌరస్తా నుంచి అప్పాపూర్ చెంచుపెంట, రాంపూర్ పెంట మీదుగా 31 కి.మీ., దూరంలో దట్టమైన మార్గంలో సలేశ్వర క్షేత్రం ఉంటుంది. ఇదే కాకుండా బల్మూర్, లింగాల- అప్పాయిపల్లి ద్వారా మరో మార్గం కూడా అందుబాటులో ఉంటుంది. అయితే అతికష్టం మీద సంగండి గుండాల వరకు ట్రాక్టర్ల ద్వారా వెళ్లేందుకు దారి ఉంది. కానీ, ఈ మార్గంలో భక్తులందరూ కాలినడకనే వెళ్తుంటారు.

పిడికెడు శివలింగం..



కొలువుదీరిన లింగమయ్య

కేవలం పిడికెడు ఎత్తు గల శివలింగం దాని మీద ఇత్తడితో చేసిన నాగ పడగను భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారు. సలేశ్వరం లింగమయ్యను దర్శించుకొనేందుకు వెన్నెల రాత్రిలో వేలాది మంది భక్తులు రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చి కారడవిలో ప్రయాణిస్తారు. లింగమయ్య నామస్మరణతో నల్లమల అభయారణ్యం పులకించిపోతోంది. పైనుంచి జాలువారే జలపాతం వద్ద భక్తులు కొండపైకి ఎగబాకి పుణ్యస్నానాలు ఆచరిస్తారు. లక్షలాది మందితో నల్లమల అడవితల్లి నిండుగా కనిపిస్తోంది. ఉత్సవాల తర్వాత ఈ ప్రాంతానికి వెళ్లడానికి ఎవరూ సాహసించరు. మూడురోజుల పాటు ఇక్కడ వివిధ స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు ఉచిత భోజన ఏర్పాట్లతోపాటు మంచినీటి వసతి కల్పిస్తారు.

ప్రత్యేక బస్సులు..

సలేశ్వరం జాతర జరిగే మూడు రోజుల్లో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుంది. అచ్చంపేట, కల్వకుర్తి, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట, మహబూబ్‌నగర్, గద్వాల, దేవరకొండ, మిర్యాలగూడ, నల్లగొండ డిపోల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపేందుకు ఏర్పాట్లు చేశారు.

ఐదు ప్రధానమైన మైల్ స్టోన్స్

రాంపూర్ చెంచుపెంట నుంచి సలేశ్వరం వరకు ఐదు ప్రధాన మైల్ స్టోన్స్ ఉన్నాయి. ఇక్కడ విశ్రాంతి కోసం విడిది, తాగునీటి వసతి కల్పించారు. రాంపూర్‌పెంట దాటిని తర్వాత అర కి.మీ., దూరంలో వాహనాల పార్కింగ్ ఉంటుంది. ఇక్కడి నుంచి మోకాల కుర్వ, కి.మీ., దాటిన తర్వాత గాడిద దొన్న కాల్వ వస్తుంది. అక్కడ కూడా విశ్రాంతి తీసుకోవచ్చు. మరో అర కి.మీ., దాటితే ఇప్పచెట్టుబండ, కి.మీ., తర్వాత అప్పాయిపల్లి దారి వస్తుంది. లోయలోకి దిగుతుంటే మైసమ్మకట్ట వద్ద పూజలు చేస్తారు. పాపనాశనం నీళ్ల చుక్కలుగా పడతాయి. లోయలోకి కిలోమీటర్లు పోతే భైరవుని గుడి వస్తుంది. మహిళలకు ఏమైనా ఇబ్బంది ఉంటే ఇక్కడే ఉండిపోవాలి. చెప్పులు కూడా ఇక్కడే వదలాలి. కిందికి వెళ్తే నీళ్ల కాల్వ బారికేడ్లు వస్తాయి. ఇక్కడ రూ.20 టికెట్ తీసుకుని క్యూలో వెళ్లాలి. అనంతరం శనేశ్వర ఆలయానికి ఎదురుగా ఉండే శంకుతీర్థంలో స్నానం చేయాలి. శనేశ్వర ఆలయం సందర్శించిన తర్వాత లోయలోకి ముందుకు వెళ్తే సలేశ్వర తీర్థం వస్తుంది. ఇక్కడ రెండు గుండాలు (శంకుతీర్థం, సలేశ్వర తీర్థం) ఉంటాయి. సలేశ్వరం తీర్థం వద్ద 300ల అడుగుల పైనుంచి జలపాతం పడుతుంది. ఇక్కడ జలధారలు ఉన్నాయి. ఇక్కడ గుహలోనే సలేశ్వరం లింగమయ్య కొలువుదీరాడు. ఇక్కడి పోయే దారి, వచ్చే దారి వేర్వేరుగా ఉంటాయి.

వెయ్యి అడుగుల లోతులో..



సలేశ్వరం లింగమయ్య యాత్ర 200 అడుగుల లోతున పదునైన రాళ్లతో కూడిన గుట్టను దిగడంతో ప్రారంభమవుతుంది. గుట్టను దిగిన తర్వాత 500–600 అడుగుల ఎత్తు ఉండే మరో గుట్ట దిగుతూ 'వస్తున్నాం.. లింగమయ్యా' అంటూ భక్తి ప్రపత్తులతో వేడుకుంటూ ముందుకు సాగాలి. సుమారు వెయ్యి అడుగులకు పైగా లోయ వైపు కొండ చరియలను ఆధారంగా చేసుకుని.. కర్రల సాయంతో దిగాల్సి ఉంటుంది. అయితే సలేశ్వరం జాతర అంటేనే పున్నమి వెన్నెల్లో రాత్రివేళ చేసే ప్రయాణం. అలాంటిది పగలు మాత్రమే అనుమతిస్తే.. మండుటెండల్లో కాలికి చెప్పులు లేకుండా రాళ్లు, రప్పల్లో కాలినడకన వెళ్లడం సాధ్యమేనా అంటూ భక్త యాత్రికులు ప్రశ్నిస్తున్నారు.

న్యూస్‌రీల్

త్వరలో క్రికెట్ మైదానంలో టర్ఫ్ వికెట్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని పిల్లలమర్రి ఎండీసీఏ క్రికెట్ మైదానంలో హెచ్‌సీఏ సహకారంతో టర్ఫ్ వికెట్ ఏర్పాటు కానుందని మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జిల్లాకేంద్రంలో నిర్వహించిన వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం ప్రారంభోత్సవంలో హెచ్‌సీఏ జాయింట్ సెక్రటరీ బస్వరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్న టర్ఫ్ వికెట్ ఏర్పాటు గురించి విజ్ఞప్తి చేయగా.. ఆయన సానుకూలంగా స్పందించి హెచ్‌సీఏ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లగా టర్ఫ్ వికెట్ ఏర్పాటుపై మార్గం సుగమం అయిందన్నారు. ఎండీసీఏ, జిల్లా క్రీడాకారుల ఎన్నో ఏళ్ల టర్ఫ్ వికెట్ ఏర్పాటు కావడం సంతోషంగా ఉందన్నారు. త్వరలో టర్ఫ్ వికెట్ ఏర్పాటు కోసం హెచ్‌సీఏ పెద్దలు శంకుస్థాపన చేస్తారన్నారు. క్రికెట్ మైదానంలో టర్ఫ్ వికెట్ ఏర్పాటు చేస్తున్నందుకు హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

డీకే అరుణను ఓడించడమే లక్ష్యంగా పనిచేస్తా



స్టేషన్ మహబూబ్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ బిడ్డను ఓడించిన డీకే అరుణ ఓటమే లక్ష్యంగా పనిచేస్తానని గద్వాల జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలోనే అత్యధికంగా బీసీలు వెనకబడిన గద్వాల అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బీసీ ఆడబిడ్డకు టికెట్ ఇస్తే తన రాజకీయ పెత్తనం కోసం ఓడించారని ఆరోపించారు. డీకే అరుణ గద్వాల నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసినప్పటికీ ఆర్థికంగా, అక్షరాస్యత పరంగా వెనకబడే ఉందన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం ఎంపీగా పోటీచేస్తున్న డీకే అరుణ నిజస్వరూపం ఈ ప్రాంత ప్రజలు తెలుసుకోవాలన్నారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసే వరకు ఇక్కడే ఉండి డీకే అరుణ ఓటమి కోసం పనిచేస్తానని చెప్పారు. సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, న్యాయవాది మధుసూదన్‌బాబు, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగాపూర్‌తండాను సందర్శించిన వైద్యులు



నర్సింగాపూర్‌తండాలో జ్వర పీడితులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీధర్‌రెడ్డి తదితరులు

సాక్షి ఎఫెక్ట్..


భూత్పూర్: మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డు నర్సింగాపూర్‌తండాను జిల్లా ఉప వైద్యాధికారి శ్రీధర్‌రెడ్డి, ఐడీఎస్‌పీ సీజినల్ డిసీజెస్ జిల్లా అధికారి యుగేంధర్, ఎపిడామోలోజిస్టు జానకిరాం, హెల్త్ అసిస్టెంట్ రమణ ఆదివారం పరిశీలించారు. తండాలో నెలరోజులుగా ఇంటింటికీ ఇద్దరు, ముగ్గురు జ్వరాలతో బాధపడుతున్న వైనంపై ఆదివారం 'సాక్షి'లో 'ఊరంతా ఫీవర్' శీర్షికన ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. ఈ మేరకు స్పందించిన వైద్యాధికారులు నర్సింగాపూర్‌తండాలో ఇంటింటికి తిరిగి జ్వరపీడితులను పరీక్షించి ఆరోగ్య సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. తండాలో 15 రోజులు వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా అధికారులు తెలిపారు. నెల రోజుల క్రితం శంషాబాద్ నుంచి తండాకు చెందిన ఓ మహిళ అనారోగ్యానికి గురై తన పుట్టింటికి వచ్చిందని, ఆ మహిళకు దోమ కాటు వేయడంతో వైరస్ వ్యాప్తి చెంది తండాలో ఒకరి నుంచి మరొకరికి వ్యాధి సంక్రమించిందని జిల్లా అధికారులు చెప్పారు. ప్రస్తుతం తండావాసులు జ్వరం, కీళ్ల నొప్పుల నుంచి కోలుకుంటున్నారని, వ్యాధి నయం అయ్యే వరకు వైద్య శిబిరం ఏర్పాటు కొనసాగిస్తామని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నర్సింగాపూర్‌తండావాసులు తమ సమస్యను వెలుగులోకి తీసుకువచ్చి పరిష్కారానికి కృషిచేసిన 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అధికారుల వెంట సబ్ యూనిట్ ఆఫీసర్ రమేష్, మండల వైద్యాధికారి అబ్దుల్ రబ్, హెల్త్ అసిస్టెంట్ సీహెచ్‌ఓ అయూబ్‌ఖాన్, సూపర్‌వైజర్ సుధాకర్, హెల్త్ అసిస్టెంట్ ప్రమోద్, శ్రీనివాసులు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు తదితరులున్నారు.

రమణీయం.. రాములోరి రథోత్సవం



రథోత్సవానికి హాజరైన భక్తులు

చారకొండ: అపర భద్రాద్రి సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున నిర్వహించిన రథోత్సవం కనులపండువగా సాగింది. రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన రథంపై సీతారామలక్ష్మణ ఉత్సవ విగ్రహాలను ఉంచి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఆలయ చైర్మన్ రామశర్మ రథాన్ని లాగి ప్రారంభించారు. ప్రధాన ఆలయం నుంచి ముక్కిడి పోచమ్మ, దత్తాత్రేయ మందిరం వరకు లాగి తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు. కార్యక్రమానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు.



సీతారామలక్ష్మణ ఉత్సవ విగ్రహాలు

అభద్రతాభావంలో సీఎం రేవంత్‌రెడ్డి

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

పాలమూరు: బీఆర్‌ఎస్– కాంగ్రెస్ మధ్య చీకటి ఒప్పందం ఉందని, అందుకోసమే ఎన్నికల సమయంలో చెప్పిన బీఆర్‌ఎస్ అవినీతిపై విచారణ, కాళేశ్వరంపై సీబీఐ విచారణ మరిచిపోయారని, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం సమసిపోయిందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. మహబూబ్‌నగర్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ పార్టీ అని ఆరోపించారు. ఇటీవల ఓ కార్యక్రమంలో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ మోదీ అవినీతి చాంపియన్ అని మాట్లాడటం సిగ్గు చేటని, అవినీతి పుట్టిందే కాంగ్రెస్ పార్టీలోనే అని విమర్శించారు. మొదట రాష్ట్రంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై దృష్టిపెట్టాలని హితవు పలికారు. మాట్లాడితే ఐదు గ్యారంటీలు అమలు చేశానని చెబుతున్న రేవంత్‌రెడ్డి భూతద్దం పెట్టి వెతికినా అవి కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. మహాలక్ష్మి పథకంలో బస్సు ఫ్రీ ఒక్కటే కాదని ప్రతి మహిళకు రూ.2,500 ఇవ్వాలని, గ్యాస్ సిలిండర్ కూడా ఇస్తేనే ఆ పథకం పూర్తవుతుందని చెప్పారు. రైతులకు రుణమాఫీ, రైతుబంధు, నిరుద్యోగ భృతి ఎక్కడ పోయాయని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి అభద్రతాభావంలో ఉన్నారని, ఆయన కొడంగల్‌కు ముఖ్యమంత్రా.. లేక రాష్ట్రానికా అర్థం కావడం లేదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే నౌక అన్నారు. దేశంలో 60 ఏళ్ల కాంగ్రెస్ పాలన ఏ విధంగా ఉందేదో చూశామని, ప్రస్తుతం పదేళ్ల కాలంలో మోదీ పరిపాలన ప్రపంచ దేశాలకు ఆదర్శవంతంగా నిలిచిందని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ఇచ్చి డీకే అరుణ గెలుపునకు కృషి చేసి పాలమూరు సీటు మోదీకి బహుమతిగా ఇవ్వాలని కోరారు. సమావేశంలో మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ, చీకోటి ప్రవీణ్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం నేతలు పాల్గొన్నారు.

న్యాయమూర్తుల బదిలీలు

పాలమూరు: మేడ్చెల్– మల్కాజ్‌గిరి కోర్టు నుంచి మహబూబ్‌నగర్ జిల్లా కోర్టు మొదటి అదనపు జడ్జిగా కె.కల్యాణ చక్రవర్తి బదిలీపై రానున్నారు. అదేవిధంగా ఫాస్ట్‌ట్రాక్, మహిళా కోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్న వై.పద్మ హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టుకు బదిలీ అయ్యారు. గద్వాల జిల్లా కోర్టులో మొదటి అదనపు జిల్లా అండ్ సెషన్స్ న్యాయమూర్తిగా పనిచేస్తున్న అన్నె రోస్ క్రిస్టియానా హైదరాబాద్ సిటీ కోర్టుకు బదిలీ అయ్యారు. మహబూబ్‌నగర్ ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి రాచపూడి శ్రీదేవి బదిలీ కావడం జరిగింది.

క్లుప్తంగా

బైక్‌ను ఢీకొన్న కారు: యువకుడు మృతి


భాస్కర్ (ఫైల్)

కొత్తకోట రూరల్: కారు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొనడంతో యువకుడి తలకు తీవ్ర గాయాలై మృతి చెందిన ఘటన మండలంలోని పాలెం జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కనిమెట్టకు చెందిన భాస్కర్(23) తన బైక్‌పై ఆదివారం కనిమెట్ట నుంచి వనపర్తికి బయలుదేరాడు. హైదరాబాద్ వైపు నుంచి బెంగుళూర్ వెళ్తున్న కారు పాలెం సమీపంలో జాతీయ రహదారిపై డ్రైవర్ ముందు వెళ్తున్న బైక్‌ను బలంగా ఢీకొట్టాడు. బైక్‌పై ఉన్న భాస్కర్ తలకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు వెంటనే కొత్తకోటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని వనపర్తి ఆస్పత్రికి తరలించారు. తండ్రి శాంతన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఏఈఓ బలవన్మరణం


రామాంజనేయులు (ఫైల్)

చారకొండ: మండలంలోని గోకారం గ్రామంలో ఏఈఓగా విధులు నిర్వర్తిస్తున్న కడారి రామాంజనేయులు (26) పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వారి కథనం మేరకు.. ఆదివారం కల్వకుర్తిలో జరిగిన ఓ శుభకార్యానికి హాజరై పట్టణ శివారులో పురుగుమందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గుర్తించిన స్థానికులు వెంటనే కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమించిందని సూచించడంతో వెల్దండ సమీపంలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. రామాంజనేయులు స్వగ్రామం కోడేరు మండలం సింగాయిపల్లి. 2019 నుంచి గోకారం వ్యవసాయ విస్తరణ అధికారిగా విధులు నిర్వహిస్తూ కల్వకుర్తిలో ఓ అద్దె ఇంటిలో నివాసం ఉండేవాడు. భార్య సంతోషి, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. మృతికి గల కారణాలు తెలియ రాలేదు.

గేట్‌వాల్వ్ తిప్పుతుండగా కాలుజారి వాటర్‌మన్ మృతి

బిజినేపల్లి: మండల కేంద్రంలో వాటర్‌మన్‌గా పని చేసే రామచంద్రయ్య (60) పబ్లిక్ వాటర్ ట్యాంకు గేట్‌వాల్వ్ తిప్పుతూ ప్రమాదశావత్తు కాలు జారిపడి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం ఉదయం ఒకటవ వార్డులో చోటు చేసుకుంది. ఎస్ఐ నాగశేఖరరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బిజినేపల్లికి చెందిన రామచంద్రయ్య ఉదయం 6 గంటలకు పబ్లిక్ వాటర్ ట్యాంకు గేటువాల్వ్ తిప్పి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. 1వ వార్డులో పబ్లిక్ గేటువాల్వ్ ఆయన తిప్పుతుండగా ప్రమాదశావత్తు నాచులో కాలు పెట్టి జారిపడ్డాడు. అప్పుడు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య పోచమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మోసం చేసింది కాంగ్రెస్సే

- డీకే అరుణ గెలుపు బాధ్యత మాదిగలు తీసుకుంటారు..
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ


మహబూబ్‌నగర్‌లో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ, చిత్రంలో డీకే అరుణ తదితరులు

పాలమూరు: ఎస్సీ వర్గీకరణ విషయంలో మాదిగలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా మోసం చేసిందని, 2013లో సోనియాగాంధీ ఇచ్చిన మాట నిలుపుకోకుండా దళితులను మరోసారి మోసం చేశారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. మహబూబ్‌నగర్‌లోని కాళికాంబ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి మందకృష్ణతోపాటు డీకే అరుణ హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మందకృష్ణ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో కూడా పార్లమెంట్‌లో బిల్లు పెట్టలేదని, ప్రతిపక్షంలో ఉండి కూడా ఆ పార్టీ మాదిగలకు అన్యాయం చేసిందన్నారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయినా కూడా మాదిగలకు న్యాయం జరగదన్నారు. మాదిగలను ముఖ్యమంత్రి చేస్తానని నమ్మించి ద్రోహం చేసిన కేసీఆర్ మాటలు నమ్మే పరిస్థితి అసలే లేదన్నారు. మహబూబ్‌నగర్‌లో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ గెలుపు బాధ్యత ఎమ్మార్పీఎస్ తీసుకుంటుందన్నారు. షెడ్యూల్ కులాల వర్గీకరణ కోసం ప్రధాని మోదీ నుంచి భరోసా రావడం సంతోషకరమన్నారు. మోదీ ఎస్సీ వర్గీకరణ హామీని నిలబెట్టుకుంటారని విశ్వసిస్తున్నట్లు చెప్పారు. మాదిగల వర్గీకరణ అంశంలో ఎంతోమంది రాజకీయ నాయకులను కలిశామని, అయినా ఎలాంటి ఫలితం లేకపోయిందన్నారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కానీ అయోధ్యలో రామమందిరం నిర్మాణం, 371 ఆర్టికల్ రద్దు, అగ్రకులాలకు రిజర్వేషన్ మోదీ హయాంలో సాధ్యమయ్యాయన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్‌కు అండగా ఉంటానని హామీ ఇచ్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎన్నో స్కాంలు జరిగాయని, ఇప్పుడు ఎలాంటి స్కాంలు వెలుగు చూసినా జైలుకు వెళ్తున్నారని తెలిపారు. షెడ్యూల్ కులాల్లో 70 శాతం ఉన్న మహబూబ్‌నగర్‌లో ఒక్క సీటు కూడా కాంగ్రెస్ కేటాయించలేదన్నారు. మాదిగ బిడ్డల చిరకాల ఆకాంక్ష అయిన ఎస్సీ వర్గీకరణకు స్పష్టమైన హామీ ఇచ్చిన మోదీని మరోసారి ప్రధాని చేయడమే లక్ష్యంగా మాదిగలు అందరూ పనిచేయాలన్నారు. మహబూబ్‌నగర్‌లో డీకే అరుణ గెలుపే లక్ష్యంగా పనిచేసి మాదిగలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు మాదిగల సత్తా ఏంటో చూపిస్తామన్నారు. అనంతరం ఎంపీ అభ్యర్థి డీకే అరుణ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల అభివృద్ధి సాధ్యం అని, గత 30 ఏళ్లుగా మందకృష్ణ మాదిగ పోరాటం చేస్తున్నారన్నారు. కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ సమస్యను ప్రధాని మోదీ దృష్టికి తీసుకువెళ్లారని, తీవ్రతను గుర్తించిన ప్రధాని మోదీ మాదిగలకు భరోసా ఇచ్చారన్నారు. ఎస్సీ వర్గీకరణకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు. మాదిగల 30 ఏళ్ల కల బీజేపీతోనే సాధ్యం అవుతుందన్నారు.

ప్రచార పర్వం

ఆశీర్వదించండి.. సమస్యలు పరిష్కరిస్తా

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్


పెంట్లవెల్లిలో ఓ వస్త్ర దుకాణంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కొల్లాపూర్/పెంట్లవెల్లి: సామాన్యుల కష్టాలు తెలిసిన వ్యక్తినని.. తనను ఎంపీగా ఆశీర్వదిస్తే, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం కొల్లాపూర్‌లోని మినీ స్టేడియం నుంచి ప్రధాన రహదారుల మీదుగా మార్నింగ్ వాక్ చేశారు. ఈసందర్భంగా ఓ ల్యాండ్రీ షాపులో బట్టలు ఇస్త్రీ చేశారు. హోటల్‌లో దోశలు వేశారు. ఆర్టీసీ కార్మికులు, ఆటో డ్రైవర్లు, కోళ్ల విక్రయించే వ్యాపారులతో ముచ్చటించారు. హమాలీలను కలిసి మూటలు మోశారు. సంతబజారులో కూరగాయల వ్యాపారులు, కొనుగోలుదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పెంట్లవెల్లిలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధిని పక్కనబెట్టి, వ్యక్తులను బెదిరించే పనులకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ఇదే పద్ధతి కొనసాగుతోందన్నారు. ప్రజలు కోరుకున్న మార్పు ఇది కాదన్నారు. ఇప్పటికే ప్రజలకు ప్రభుత్వ వైఖరి అర్థమైందని.. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పేందుకు సిద్ధమయ్యారని ఆయన వివరించారు. మాజీ సీఎం కేసీఆర్ పదేళ్ల కాలంలోనే 40 ఏళ్ల అభివృద్ధిని చేసి చూపించారని అన్నారు. కారు గుర్తుకు ఓటువేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రంగినేని అభిలాష్‌రావు, నరేందర్‌రెడ్డి, కాటం జంబులయ్య, అలంపూర్ సురేందర్‌రావు, నరేందర్ రెడ్డి, పోతుల వెంకటేశ్వర్లు, రాజేష్, సురేందర్‌గౌడ్, కట్టా శ్రీనివాసులు, కారంగి బ్రహ్మయ్య, చాకలి నర్సింహ, కృష్ణమూర్తి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నాం..

ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, వంశీచంద్‌రెడ్డి


కాకర్లపహడ్‌లో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

నవాబుపేట: ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి, కాంగ్రెస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మైసమ్మ ఆలయంలో పూజలు చేసిన ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తీగలపల్లి, కాకర్లపహాడ్, లోకిరేవు, కిషన్‌గూడ గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో కొన్ని పథకాల అమలుకు ఆటంకి ఏర్పడిందని, ఎన్నికలు పూర్తికాగానే అన్ని పథకాలు అమలు చేస్తామన్నారు. ప్రజలకు అండగా ఉండేందుకే సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజా పాలన ప్రారంభించామని, గతంలో మాదిరిగా నియంత పాలన లేదన్నారు. ప్రజలకు కావాల్సిన ఇళ్లు, రుణమాఫీ పథకాలు త్వరలో అందుతాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా కాంగ్రెస్‌కే జైకొట్టాలని వారు కోరారు. ఈ సందర్భంగా మహిళలు, ఉపాధి కూలీలు, యువకులతో ఆయా గ్రామాల్లో చర్చావేదిక నిర్వహించారు. కార్యక్రమంలో శివసేనారెడ్డి, జహీర్, దుశ్యంత్‌రెడ్డి, రవి, రాంచంద్రయ్య, అజహర్, తులసిరాం, వాసు, మల్లేష్‌యాదవ్, రాజేష్, వెంకటయ్య, నారాయణ రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

పాలమూరులో వలసలు నివారించాం


మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

అడ్డాకుల: తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన కేసీఆర్ పాలమూరు జిల్లాలో కృష్ణా జలాలను పారించి వలసలను నివారించి కూలీలను ఆదుకున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం సాయంత్రం అడ్డాకులలో నిర్వహించిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ పల్లె రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఎండాకాలంలో వాగుల్లో కృష్ణా జలాలను పారించి రైతులను ఆదుకున్న ఘనత కేసీఆర్‌దేనన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత అన్నివర్గాల ప్రజలను ఆదుకుని ఈ ప్రాంతం అభివృద్ధికి పెద్దపీట వేశామన్నారు. తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో బీఆర్ఎస్ హయాంలో సీఎం కేసీఆర్ చేపట్టిన పథకాలు దేశంలో ఎక్కడా లేవన్నారు. 24 గంటల నిరంతర కరెంట్ సరఫరా చేసి రైతులను ఆదుకున్న ఘనత కూడా కేసీఆర్‌కే దక్కిందన్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పింఛన్లు అందించామని తెలిపారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓట్లేసి తనను గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ నంబర్ వన్‌గా తీర్చిదిద్దారని కొనియాడారు. కాంగ్రెస్ మాయమాటలు నమ్మి అసెంబ్లీ ఎన్నికల్లో మోసపోయామని, మరోసారి మోసపోకుండా పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేయాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, ఇంద్రయ్యసాగర్, పార్టీ మండలాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనర్సింహయాదవ్, వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, జెడ్పీ మాజీ కోఆప్షన్ మహిమూద్ తదితరులు పాల్గొన్నారు.

బడుగుల అభ్యున్నతికి కృషి : మల్లురవి


బల్మూర్‌లో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి మల్లురవి

బల్మూర్/ లింగాల: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ పాటుపడుతుందని నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మల్లురవి అన్నారు. బల్మూర్‌లో ఆదివారం ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో అధికారంలోకి రాగానే గ్యారంటీలను అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకుందన్నారు. అచ్చంపేట ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ మాట్లాడుతూ దేశంలో రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమన్నారు. నల్లమల ప్రాంతమైన బల్మూర్ మండలంలో రిజర్వాయర్‌తో రైతులకు సాగునీరు అందించి అభివృద్ధి చేస్తామన్నారు. దీంతో పాటు లెదర్‌పార్కు అభివృద్ధి చేసి చర్మకారులకు పని కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆదివారం రాత్రి లింగాల మండల కేంద్రంలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్నర్ సమావేశంలో ఎంపీ అభ్యర్థి మాట్లాడుతూ ఈ ప్రాంత సమస్యలు బాగా తెలుసునని, గతంలో ఈ ప్రాంతంలో తిరిగి ప్రజల కష్ట సుఖాలను తెలుసుకున్న మనిషినని అన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని విమర్శించారు. రాష్ట్రంలో ఏరకంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి తీవ్రంగా కృషి చేశారో అదే విధంగా తన గెలిపిస్తే అభివృద్ధికి, నిరుద్యోగ సమస్య తీర్చడానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రాథోడ్, వెంకట్‌రెడ్డి, గిరివర్ధన్‌గౌడ్, కాశన్నయాదవ్, యుగేంధర్‌రెడ్డి, రాంప్రసాద్‌గౌడ్, తిరుపతయ్య, సునీల్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, ఖదీర్, ఖాజా, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలోనే అభివృద్ధి పరుగులు

- 25న ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ నామినేషన్.. హాజరుకానున్న గుజరాత్ సీఎం
- ఎంపీ రాములు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రాములు

నాగర్‌కర్నూల్: కేంద్రంలో మోదీ.. ఇక్కడ మోదీ బలపర్చిన అభ్యర్థి భరత్ ప్రసాద్ ఉంటేనే నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని ఎంపీ పోతుగంటి రాములు అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహేంద్రనాథ్ స్ఫూర్తితో రాజకీయాల్లో సేవ చేస్తున్నామని.. ఆయన అడుగుజాడల్లో నడుస్తున్నామని చెప్పారు. తన కుమారుడు భరత్‌ప్రసాద్‌కు జెడ్పీ చైర్మన్ అవకాశం వస్తే కొందరు సైంధవుల్లా అడ్డుకున్నారని.. రాజకీయాల్లో ఇది మంచి పద్ధతి కాదన్నారు. ప్రధాని మోదీ నాగర్‌కర్నూల్‌కు వచ్చినప్పుడు పలు సమస్యలపై వినతిపత్రం అందించామని, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. బీజేపీ అభ్యర్థి గెలిస్తే కేంద్రియ విద్యాలయాలు, నవోదయ పాఠశాల, పాలమూరు-రంగారెడ్డి పథకానికి జాతీయ హోదా తీసుకురావచ్చని చెప్పారు. స్థానికులు కాని వారు ఇక్కడ పెత్తనం చెలాయించాలని చూస్తున్నారని, స్థానిక నాయకత్వాన్ని గెలిపించుకోవాలని కోరారు. ఈ నెల 25న భరత్ ప్రసాద్ రెండోసెట్ నామినేషన్ దాఖలు చేస్తారని.. ఈ కార్యక్రమానికి గుజరాత్ సీఎం భూపేంద్రభాయ్ పటేల్ హాజరు కానున్నారని, ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలన్నారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీపాచారి, బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, బచ్చిరెడ్డి, యాదగిరిరావు, రాజవర్ధన్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల ఆరాధ్యుడు.. గురులోకా మాసంద్

- నేటినుంచి బావాజీ ఉత్సవాలు
- వివిధ రాష్ట్రాల నుంచి తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికార యంత్రాంగం రేపు సీఎం రేవంత్‌రెడ్డి రాక


గురులోకా మాసంద్ ప్రభు ఆలయం (ఇన్‌సెట్‌లో అమ్మవారు)

మద్దూరు: కొత్తపల్లి మండలంలోని తిమ్మారెడ్డిపల్లి సమీపంలో వెలసిన గిరిజనుల ఆరాధ్యదైవం గురులోకా మాసంద్ ప్రభు (బావోజీ) ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. నాలుగు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా, కర్ణాటక, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తిచేసింది. తన బోధనలతో తమ జీవన విధానంలో మార్పు తీసుకొచ్చిన గురులోకా మాసంద్ ప్రభును గిరిజనులు ఆరాధ్యదైవంగా భావిస్తారు. ఆయన పుట్టిన రోజు (చైత్రశుద్ధ పౌర్ణమి)ని పురస్కరించుకొని ప్రతి ఏటా ఉత్సవాలు నిర్వహిస్తూ వస్తున్నారు.

జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు..

బావోజీ జాతరకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఇప్పటికే వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిలు సమావేశమై దిశానిర్దేశం చేశారు. జాతర జరిగే నాలుగు రోజులు పర్యవేక్షణాధికారులుగా జిల్లా అధికారులు వ్యవహరించనున్నారు. ఉత్సవాల్లో పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరా తదితర ఏర్పాట్ల కోసం 460 మంది సిబ్బందిని కేటాయించినట్లు డీపీఓ అనిత తెలిపారు. జాతరను 12 సెక్టార్లుగా విభజించి, ఒక్కో సెక్టార్ ఇన్‌చార్జిగా ఎంపీఓ వ్యవహరిస్తారని వివరించారు. భక్తుల సమస్యల పరిష్కారానికి రెండు కంట్రోల్ రూంలను ఏర్పాటు చేయడంతో పాటు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు సీఐ సోమనర్సయ్య తెలిపారు. గ్రామంలో ఎవరైనా మద్యం విక్రయాలు సాగిస్తే, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి రాక..

23వ తేదీన గురులోకా మాసంద్ ప్రభు ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. సీఎం పర్యటన సందర్భంగా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం బావోజీ జాతర ప్రాంగణాన్ని ఎస్పీ యోగేష్ గౌతమ్ పరిశీలించారు. హైదరాబాద్ నుంచి నేరుగా హెలికాప్టర్‌లో ఉదయం 11 గంటలకు మద్దూరులోని గ్రీన్ ప్యాలెస్ వద్ద ఏర్పాటుచేసిన హెలీప్యాడ్‌కు సీఎం చేరుకోనున్నారు. అక్కడ పార్టీ కార్యకర్తల సమావేశం అనంతరం మధ్యాహ్నం 12గంటలకు రోడ్డు మార్గాన తిమ్మారెడ్డిపల్లికి బయలుదేరుతారు. బావోజీ ఉత్సవాలకు సీఎం రాక సందర్భంగా 100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ తెలిపారు. ఆయన వెంట డీఎస్పీ లింగయ్య ఉన్నారు.

బావోజీ జీవిత చరిత్ర..

16వ శతాబ్దం మధ్యకాలంలో లక్ష్మీబాయి, రాంజీ మహారాజ్ దంపతులకు గురులోకా మాసంద్ ప్రభు జన్మించారు. బావోజీ మహిమలకు అందరూ ఆశ్చర్యానికి గురయ్యేవారు. లోక కల్యాణార్థం పదో ఏటానే దేశ సంచారం చేపట్టిన బావోజీ.. అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయాన్ని దర్శించుకున్నారు. 12 ఏళ్ల పాటు కఠోర నియమాలతో గురుగ్రంథం పఠించారు. అనంతరం ఛతీస్‌ఘడ్‌లోని కాళికాదేవిని ప్రసన్నం చేసుకునేందుకు 25 ఏళ్ల కఠోర తపస్సు చేశారు. కళికాదేవి నుంచి మహిమగల గుర్రము పొందిన ఆయన.. గిరిజనులను చైతన్యం చేస్తూ దేశ సంచారం గావించారు. ఈక్రమంలో కొత్తపల్లి మండలం తిమ్మారెడ్డిపల్లి పెద్దవాగు సమీపంలో మారెడు చెట్టు కింద కాళికాదేవి ప్రసన్నం కోసం 12 ఏళ్ల పాటు తపస్సు చేశారు. అక్కడే కాళికాదేవిని ప్రతిష్ఠించి, గిరిజనులకు హితబోధలు చేశారు. కొన్నేళ్లకు ఆలయం పక్కనే బావోజీ జీవసమాధి అయినట్లు చరిత్ర చెబుతోంది. ఆయన సమాధి చుట్టూ నాలుగు ద్వారాలను నిర్మించుకున్నారు. అందులో మూడు ద్వారాల నుంచి బంజారా జాతిలో గల చౌహాన్, పావర్, రాథోడ్ ఉపతెగలు దర్శించుకోవడానికి, మరో ద్వారం భక్తులందరూ దర్శించుకోవడానికి కేటాయించారు.

ఉత్సవాల వివరాలు..

- 22న ధ్వజారోహణం (అర్దాస్), రాత్రి ప్రభోత్సవం, బంజారాల సాంస్కృతిక కార్యక్రమాలు
- 23న గురులోకా మాసంద్ ప్రభు, ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజులు, రాత్రి 2 గంటలకు రథోత్సవం (తేరు)
- 24న మహాభోగ్, ప్రభు వారికి పల్లకీసేవ, కాళికాదేవికి మొక్కుల చెల్లింపులు
- 25న కాళికాదేవి పల్లకీ సేవ, హోమం, పూర్ణాహుతి, మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

'కందికొండ' ఆశయ సాధనకు కృషి


అవార్డు ప్రదానం చేస్తున్న ప్రధానకార్యదర్శి కె.ఆనందచారి

నాగర్‌కర్నూల్/కల్వకుర్తి రూరల్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని కమ్యూనిస్టుగా జీవితం సాగించిన కందికొండ రామస్వామిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలని తెలంగాణ సాహితీ ప్రధానకార్యదర్శి కె.ఆనందాచారి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయ సమావేశ మందిరంలో నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కందికొండ రామస్వామి స్మారక జాతీయ పురస్కార సభ వనపట్ల సుబ్బయ్య అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కందికొండ రామస్వామి స్మారక పురస్కారానికి ఎంపికైన డిమ్కి కథల రచయిత్రి స్ఫూర్తి కందివనంకు అవార్డు ప్రదానం చేశారు. రూ.పది వేల నగదుతో పాటు శాలువా, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించి సత్కరించారు. అంతకుముందు కందికొండ రామస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమ్యూనిస్టు జీవితమంటే పేదల జీవితాల మెరుగు, బడుగుల అభ్యున్నతికి పోరాటం చేయడమేనని అన్నారు. కవికి, కమ్యూనిస్టుకు దగ్గరి సంబంధాలు ఉన్నాయని.. ప్రజల కోసం వారు పోరాటాలు చేస్తే, ప్రజల జీవితాలను తమ కవితలు, కథలు, కళారూపాల ద్వారా ప్రదర్శిస్తూ సమాజ అభివృద్ధే లక్ష్యంగా కమ్యూనిస్టులు కవులు పనిచేస్తారని వివరించారు. అవార్డు గ్రహీత, కథా రచయిత్రి స్ఫూర్తి కందివనం రచించిన డిమ్కి కథలు బుడగజంగాల గోసల సారాంశమేనని కొనియాడారు. నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ డా. మల్లు రవి మాట్లాడుతూ.. రామస్వామి జీవితం ప్రజా పోరాటాలు, త్యాగాలతో కూడుకున్నదని, కార్మికులు, కర్షకులు, ప్రజల సమానత్వ ఆశయాలకు అనుగుణంగానే ఈ డిమ్కి కథలు రచించారని అన్నారు.

రాజ్యాంగ హక్కులను కాపాడుకుందాం..

రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆనందాచారి అన్నారు. ఆదివారం కల్వకుర్తి యూటీఎస్ భవనంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రబీర్ పుర్కయస్థ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రబీర్‌ను 8 నెలల కిందట కేంద్ర ప్రభుత్వం ఉ.పా. చట్టం కింద అరెస్ట్ చేసి జైలులో బంధించిందని, ఆయన చేసిన దేశద్రోహం, రాజ్యాంగ వ్యతిరేక కలాపాలు ఏమిటో ఇప్పటికీ చెప్పలేదన్నారు.

భారీగా నగదు పట్టివేత

అమరచింత/ అలంపూర్ / కోస్గి: అమరచింత మండలంలోని నాగల్‌కడ్మూర్ వద్ద ఆదివారం ఇద్దరు వ్యక్తుల ద్వారా రూ.4.28 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శివకుమార్ తెలిపారు. గద్వాలకు చెందిన మహబూబ్ నుంచి రూ.2.94 లక్షలు, శ్రీనివాస్ నుంచి రూ.1.43 లక్షలు స్వాధీనం చేసుకుని నారాయణపేట గ్రీవెన్ సెల్‌కు పంపామన్నారు.

- రాష్ట్ర సరిహద్దులోని పుల్లూరు చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలో హైదరాబాద్ నుంచి గోరంట్లకు వెళ్తున్న షఫీఉల్లా వాహనంలో రూ.71,200 నగదు తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఏఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు. అలాగే కలుగోట్లలో మద్దమ్మ 5.5 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ శ్రీనివాసులు చెప్పారు.
- కోస్గి మండలం ముక్తిపాడ్ చెందిన చంద్రప్ప అక్రమంగా 19.77 లీటర్ల మద్యం తరలిస్తుండగా పట్టణ శివారులో టాస్క్‌ఫోర్స్ బృందం పట్టుకున్నట్లు ఎస్ఐ శేఖర్‌గౌడ్ తెలిపారు.

క్లుప్తంగా

బీరప్ప ఉత్సవాలకు హాజరైన చిన్నారెడ్డి



అడ్డాకుల: మూసాపేట మండలం మహ్మదుస్సేన్‌పల్లి గ్రామంలో ఆదివారం బీరప్ప ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్‌ జి.చిన్నారెడ్డి హాజరై పూజలు చేశారు. అనంతరం ఉత్సవాల నిర్వాహకులు చిన్నారెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్‌ పార్టీ సోషల్‌ మీడియా కన్వీనర్‌ దేవన్నయాదవ్‌, స్థానికులు రమేష్‌, మహేష్‌, మోహన్‌రెడ్డి, యాదయ్య, పూల వీరయ్య, శ్రీనివాసులు, కృష్ణయ్య, సాయిలు తదితరులు ఉన్నారు.

మైసమ్మ చెంత భక్తుల రద్దీ



నవాబుపేట: మండల పరిధిలోని మైసమ్మ దేవాలయం చెంత ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో మైసమ్మ అడవి మొత్తం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. కాగా భక్తులు పచ్చని చెట్ల కింద విందులు ఏర్పాటు చేసుకుని ఉల్లాసంగా గడిపారు.

23న కవి సమ్మేళనం

స్టేషన్‌ మహబూబ్‌నగర్: ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన సాయంత్రం 4 గంటలకు పట్టణంలోని మెట్టుగడ్డలోగల లుంబిని పాఠశాలలో కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈ మేరకు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఎండి.ఖాజా మైనద్దీన్‌, కొప్పోలు యాదయ్య ఆదివారం ఓ ప్రకటనలో వివరాలను పేర్కొన్నారు. తెలంగాణ సాహితి రాష్ట్ర అధ్యక్షులు వల్లభాపురం జనార్దన అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా పాలమూరు యూనివర్సిటీ అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ నాగం కుమారస్వామి, కె.లక్ష్మణ్‌గౌడ్‌ తదితరులు హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని కవులు, కవయిత్రులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

వీరన్నపేటలో డీకే అరుణ ప్రచారం

పాలమూరు: మహబూబ్‌నగర్‌ జిల్లా కేంద్రంలోని వీరన్నపేటలో ఆదివారం బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాలనీ వాసులతో ఆమె మాట్లాడారు. కేంద్రం ఇచ్చిన సంక్షేమ పథకాలను ఓటర్లకు తెలియచెప్పారు. రాబోయో ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా తనని గెలిపించాలని కోరారు. మహబూబ్‌నగర్‌ మహిళ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని కాళికాంబ కల్యాణమండపంలో మహబూబ్‌నగర్‌ పార్లమెంట్‌ పరిధిలో ఉన్న మహిళలతో మహిళ నారి శక్తి సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షురాలు సాహితీరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదస్సుకు మహిళ మోర్చా కమిటీ సభ్యులు, మండల కమిటీ సభ్యులు తరలిరావాలన్నారు. కార్యక్రమానికి డీకే అరుణతో పాటు బీజేపీ మహిళ మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్‌ శిల్పారెడ్డి హాజరవుతారని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జడ్చర్ల: మండలంలోని మొరంబావితండాకు చెందిన కొడావత్‌ హన్మంతు (45) చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. హన్మంతు శనివారం జడ్చర్లలో పురుగుమందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గుర్తించిన తండావాసులు వెంటనే జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి అటునుంచి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య జమ్రిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్థికసాయం

మిడ్జిల్: మండల పరిధిలోని అయ్యవారిపల్లిలో కోస్గి రాంచంద్రయ్య అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన ప్రదీప్‌ రెడ్డి అంత్యక్రియల నిమిత్తం బాధిత కుటుంబానికి రూ. 3వేలు ఆర్థికసాయం చేశారు.

గెలుపోటములను సమానంగా భావించాలి

దామరగిద్ద: క్రీడల్లో గెలుపు ఓటములు సమానంగా భావించాలని క్రీడలు శారీరక వికాసానికి, మానసిక ఉల్లాసానికి ఎంతగానో తోడ్పడుతాయని నిర్వాహకులు సుదర్శన్‌రెడ్డి, రాఘవేందర్‌, మోహిన్‌ అన్నారు. గతవారం రోజులుగా మండలంలోని కాన్‌కుర్తిలో నిర్వహిస్తున్న కాన్‌కుర్తి ప్రీమియర్‌ లీగ్‌ క్రికెట్‌టోర్నీ ఆదివారం ఫైనల్‌ మ్యాచ్‌ జరిగింది. ఫైనల్‌లో ఎన్‌బీఎస్‌ కింగ్స్‌తో భవాని సూపర్‌ కింగ్స్‌ పోటీ పడగా ఎన్‌బీఎస్‌ కింగ్స్‌ విజేతగా నిలిచింది. ఈ మేరకు.. నిర్వాహకులు మాట్లాడుతూ.. క్రీడలు మానసిక వికాసానికి ఎంతగానో తోడ్పడుతాయని తెలిపారు.

మండుటెండల్లో 'చల్లని'సేవ

- దాహార్తి తీరుస్తున్న చలివేంద్రాలు
- గ్రామాలనుంచి వస్తున్న వారికి సౌకర్యం



సత్యసాయిసేవా సమితి ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద నీటికోసం ప్రజల రద్దీ

జడ్చర్ల టౌన్: మండుటెండల నేపథ్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో దాతలు, సంస్థలు, సంఘాలు, ప్రభుత్వం ఏర్పాటు చేసిన చలివేంద్రాలు ప్రజల దాహార్తి తీరుస్తున్నాయి. దీంతో ఆయా గ్రామాల నుంచి వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే ఎంతో మందికి తాగునీటి సంబంధ సమస్య లేకుండా మేలు జరుగుతోంది. చలివేంద్రాల ఏర్పాటుపై వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు సైతం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా పేరుగాంచిన వ్యాపారకేంద్రం కావటం వల్ల పట్టణానికి ఆయా ప్రాంతాలు, గ్రామాల నుంచి నిత్యం పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. అయితే వేసవిలో ఎండలు మండుతుండటంతో వారంతా దాహం తీర్చుకునేందుకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఉండేవి. హోటళ్లలోకి వెళితే టీ తాగటమో, టిఫిన్‌ చేయటమో చేస్తేనే నీళ్లు ఇస్తుంటారు. దీంతో రూ.20 పెట్టి లీటరు బాటిల్‌ కొనుగోలు చేయలేక కొందరు సతమతమవుతుంటారు. కొందరు తెలిసిన ఇళ్లు దుకాణదారుల వద్ద నీటిని తీసుకుంటారు. చిరు వ్యాపారులు, రైతులు, కూలీలు, కార్మికులు, మార్కెట్‌కు వివిధ పనులపై వచ్చే వారు మాత్రం దాహంతో తల్లడిల్లుతుంటారు. ఇలాంటి వారికి చలివేంద్రాలు దాహార్తి తీరుస్తున్నాయి. మండుటెండల్లో చల్లటినీటిని అందిస్తున్న దాతల సేవలను ప్రజలు మెచ్చుకుంటున్నారు. తమలాంటి వారికి ఎంతో మేలు చేస్తున్నారని చెబుతున్నారు.



బాబిస్ట్రీట్‌లో దాహం తీర్చుకుంటున్న ప్రజలు

ఆయా చోట్ల ఏర్పాటు ఇలా..

కాగా పట్టణంలో ఏటా కొన్ని సంస్థలు చలివేంద్రాలను నిర్వహిస్తూ వస్తున్నాయి. ప్రధానంగా పట్టణంలోని నేతాజీచౌరస్తాలో మున్సిపాలిటీ నుంచి చలివేంద్రం నెలకొల్పారు. ఉదయం 10గంటల నుంచి 4గంటల వరకు ఇక్కడ నీటిని అందిస్తున్నారు. వాసవీ బుక్‌స్టాల్‌ సమీపంలో సత్యసాయిసేవాసమితి చలివేంద్రం ప్రారంభించింది. వాసవీ కమాన్‌ వద్ద కాస్త ఆలస్యంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం ప్రారంభిస్తున్నారు. బాబీస్ట్రీట్‌లో మార్వాడి సంఘం ఆధ్వర్యంలో పదేళ్లుగా చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. రోడ్డు విస్తరణ పనుల కారణంగా సిగ్నల్‌గడ్డపై ఈ పర్యాయం ఎవరు చలివేంద్రం ఏర్పాటు చేయలేదు. ఇక క్రాస్‌రోడ్డులో మున్సిపాలిటీ నుంచి చలివేంద్రం తెరిచారు. ఆర్టీసీ అధికారుల కోరిక మేరకు ఈ పర్యాయం సత్యసాయిసేవాసమితి ఆధ్వర్యంలో బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభించారు.

ఆర్టీసీ అధికారుల కోరిక మేరకు

ఏటా సత్యసాయి సేవాసమితి నుంచి ఒక చలివేంద్రం పట్టణంలో ఏర్పాటు చేస్తూ వస్తున్నాం. అయితే ఆర్టీసీ అధికారుల కోరిక మేరకు ఈ సారి బస్టాండ్‌లో ప్రారంభించాం. మేం ఆశించినదాని కన్నా ఎక్కువగా ప్రయాణికుల నుంచి స్పందన వస్తుంది. దాహం తీర్చుకున్న ప్రయాణికులు సత్యసాయిసేవాసమితి సభ్యులు చల్లంగ ఉండాలి అని దీవిస్తున్నారు.

–రామకృష్ణ,
కన్వీనర్‌, సత్యసాయి సేవాసమితి

మాలాంటి వారికి ఎంతోమేలు

మాది కిష్టంపల్లి గ్రామం. రోజు జడ్చర్లకు వచ్చి వెళ్తాం. ఎండకు దాహం వేస్తే నీళ్లు తాగుదామంటే ఎక్కడా దొరకవు. హోటళ్లకు వెళ్లి తాగుదామంటే మళ్లీ మళ్లీ వెళ్తే ఇబ్బందిగా ఉంటుంది. బాబిస్ట్రీట్‌లో మార్వాడి సంఘం వాళ్లు, సత్యసాయిసేవా సమితి, మున్సిపాలిటి వాళ్లు, ఇంకా కొన్ని సంఘాలు పెట్టిన చలివేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల మాలాంటి వారెందరికో మేలు జరుగుతోంది.

–నర్సింహ, కిష్టంపల్లి

దాహం తీరుస్తున్నారు

పట్టణంలో పెట్టిన చలివేంద్రాలు మాలాంటి వారి దాహం తీరుస్తున్నాయి. తిమ్మాజీపేట మండలం బావాజీపల్లి నుంచి తరచూ జడ్చర్లకు వస్తుంటాం. ఎండకాలం అయితే నీళ్లకోసం చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది. రూ.20 పెట్టి లీటరు నీళ్లు కొని తాగినా దాహం తీరదు. చలివేంద్రాల్లో కుండలో చల్లటి నీళ్లు ఇస్తున్నారు. ముఖ్యంగా రైతులకు, చిరువ్యాపారులకు, పేదలకు ఎంతో ఉపయోగకరం.

–మల్లయ్య, బావాజిపల్లి

గ్యారంటీల అమలు బోగస్‌

మహబూబ్‌నగర్‌ రూరల్: కాంగ్రెస్‌ ఆరు గ్యారెంటీల అమలు పెద్ద బోగస్‌ అని బీజేపీ మండల ఇన్‌చార్జ్‌ ఎస్‌.పాండురంగారెడ్డి విమర్శించారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణకు మద్దతుగా బీజేపీ జిల్లా ప్రచార కార్యదర్శి కోస్గి సతీష్‌కుమార్‌ ఆధ్వర్యంలో ఆదివారం గాజులపేట గ్రామంలో బీజేపీ నాయకులు ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి క్వింటాల్‌కు రూ. 500 బోనస్‌ ఇవ్వలేని కాంగ్రెస్‌ పార్టీ రూ. 2 లక్షల లోపు రుణమాఫీ చేస్తుందంటే ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. మండల అధ్యక్షుడు రాజుగౌడ్‌, నాయకులు మున్నయ్య, జి.నాగరాజు, బి.ఆనంద్‌, జాన్సీ, కిట్టు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపును ఎవరు ఆపలేరు

నవాబుపేట: మూడో సారి మోదీ దేశ ప్రధాని కావడం ఖాయమని.. బీజేపీ గెలుపు ఎవరు ఆపలేరని నియోజకవర్గం ఇన్‌చార్జ్‌ బాలత్రిపురసుందరి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని దేపల్లి, చౌడూర్‌ గ్రామాల్లో పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశం మొత్తం మోదీ కోసం ఎదురు చూస్తుందని ఆమె అన్నారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా నాయకులు బాలు, మండల పార్టీ అధ్యక్షుడు రాజు, జిల్లా నాయకులు శ్రీనివాస్‌, అర్జున్‌రెడ్డి, సతీష్‌గౌడ్‌, యాదయ్య, లక్ష్మీనారాయణ ఉన్నారు.



దేపల్లిలో ఎన్నికల ప్రచారంలో బీజేపీ నాయకులు

ఘనంగా వీరభద్రుడి ఊరేగింపు



వీరభద్ర స్వామివారు

కోయిల్‌కొండ: మండలంలోని వీరభద్రుడి జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ముందుగా స్వామివారి పల్లకీసేవను మండల కేంద్రంలోని తెలుగు వీధి నుంచి డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా మండలంలోని ఆచార్యపూర్‌ సమీపంలోని వీరన్న కొండకు తీసుకెళ్లారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవీరభద్ర ఉత్సవాలలో భాగంగా ఈనెల 22న ప్రభోత్సవం, 23న రథోత్సవం, 24న అగ్నిగుండం, 25న భద్రకాళి వీరభద్రస్వామి కల్యాణోత్సవం ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలలో ప్రతిరోజు నందికోళ్లసేవ, అఖండ భజనకార్యక్రమాలు ఉంటాయన్నారు.



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

కాంగ్రెస్‌ హయాంలో కరువు తాండవం

హన్వాడ: కాంగ్రెస్‌ అధికారంలోకి రాగానే రాష్ట్రంలో కరువుతాండవం చేస్తోందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ ఎద్దేవా చేశారు. ఆదివారం ఆయన మండలంలోని ఓ కార్యక్రమానికి వచ్చిన ఆయన తిరుగుప్రయాణంలో నాగినోనిపల్లి వద్ద ప్రధాన రహదారికి పక్కనే ఎండిన వరి పంటను పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో పంటలు కళకళలాడుతుండేవని, రైతులను ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకున్నామన్నారు. ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేసి రైతులను రాజుల్లా చూసుకున్నట్లు గుర్తుచేసుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ అధికారంలోకి రాగానే పాతరోజులు గుర్తుకు వస్తున్నాయని, నీటిని అల్లాడుతున్నారని, కరువు తాండవం చేస్తోందన్నారు. ఆరు గ్యారెంటీల పేరిట ప్రజలను మోసం చేసి అధికారంలో కి వచ్చిన కాంగ్రెస్‌కు పార్లమెంట్‌ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పనున్నట్లు వివరించారు. ఆయన వెంట ఎంపీపీ బాల్‌రాజు, మండల అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్‌, మాజీ జెడ్పీటీసీ నరేందర్‌, నాయకులు లక్ష్మయ్య, ఉషేనయ్య, శివ, తదితరులు పాల్గొన్నారు.



నాగినోనిపల్లి శివారులో ఎండిన వరిపంటను పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌

కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ల పరస్పర ఆరోపణలు

బాలానగర్: మండల పరిధిలోని బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ నాయకులు ఆదివారం పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. బీఆర్‌ఎస్‌ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి చేయకుండా రియల్‌ఎస్టేట్‌ వ్యాపారం చేశారని కాంగ్రెస్‌ నాయకులు కత్తెర కృష్ణయ్య విమర్శించారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓ యువనేత కుటుంబం అక్రమాలకు పాల్పడి హత్యా రాజకీయాలు చేసిందని అన్నారు. కాగా ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాడని అన్నారు. టోల్‌ ఫీజు కట్ట వారికి ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి లేదన్నారు. వ్యక్తిగత విమర్శలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

ప్రశ్నించే హక్కు అందిరికీ ఉంది

ఎంపీటీసీ అభిమన్యురెడ్డిని వ్యక్తిగతంగా విమర్శిస్తే చూస్తూ ఊరుకోబోమని బీఆర్‌ఎస్‌ మండల వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ బాలునాయక్‌ అన్నారు. ఎవరికి ఆపద వచ్చినా తనవంతుగా తోడ్పాటు అందిస్తున్న నాయకుడిపై విమర్శలు తగవన్నారు. ఎమ్మెల్యేను ప్రశ్నించే హక్కు ఓటరుగా అందరికీ ఉంటుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి కేటాయించాలని సూచించారు. కృష్ణయ్య వ్యక్తిగత విమర్శలు మానుకొని అభిమన్యురెడ్డికి క్షమాపణ చెప్పాలని డిమాండ్‌ చేశారు.

కోతుల నివారణకు చర్యలు చేపట్టాలి

జడ్చర్ల: పట్టణంలో కోతులు ఇళ్లలోకి చొరబడి ఆహారపదార్థాలతో పాటు గృహోపకరణాలను ధ్వంసం చేస్తున్నాయని పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక శాంతినగర్‌, గంజ్‌, శ్రీరామనగర్‌, ఎస్‌వీపీ నగర్‌, పాతబజార్‌, జవహర్‌నగర్‌, నిమ్మబాయిగడ్డ, రైల్వేస్టేషన్‌ తదితర ప్రాంతాల్లో ప్రతిరోజు వందల సంఖ్యలో కోతులు ఇళ్లపై పడి భయభ్రాంతులు కలిగిస్తున్నాయని ఆయా కాలనీవాసులు వాపోతున్నారు. శనివారం శాంతినగర్‌లో ఇళ్లపై దాడి చేసి పూలకుండీలు ధ్వంసం చేయడంతో పాటు చిన్న పిల్లలను భయపెట్టాయని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానిక వార్డు కౌన్సిలర్‌ శ్రావణి కోరారు.



శాంతినగర్‌లో గోడపై కూర్చున్న కోతుల మంద

నిరుపయోగంగా సెగ్రిగేషన్‌ షెడ్లు

చిన్నచింతకుంట: మండలంలోని వివిధ గ్రామాలల్లో నిర్మించిన సెగ్రిగేషన్‌ షెడ్లు నిరుపయోగంగా మారాయి. ప్రతి గ్రామాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రూ. కోట్లు ఖర్చు చేసి యార్డులను నిర్మించగా ఏ మాత్రం ఉపయోగం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ఎరువులను తయారు చేసేవిధంగా ప్రణాళికలు రూపొందించినా అందుకు అనుగుణంగా అడుగులు పడడం లేదు. అధికారుల పర్యవేక్షణ లోపంతో ఇలాంటి పరిస్థితి తలెత్తిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



అల్లిపూరంలో నిరుపయోగంగా షెడ్‌

గార్లపహాడ్‌లో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభోత్సవంలో నాయకులు

కోయిల్‌కొండ: మండలంలోని గార్లపహాడ్‌ గేటు వద్ద ఆదివారం చలివేంద్ర ప్రారంభించారు. గార్లపహాడ్‌ యువజన సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. యువజన సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు గత 8సంవత్సరాలుగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి తాగునీటిని అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ గ్రామ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కె.రాజు, హాజీ,ఆలీ, ముబీన్‌, మధుసూదన్‌రెడ్డి, హరి, ఆనంద్‌, మాడరాజు, శివ, రమేష్‌, ఇమ్రాన్‌, బోయరమేష్‌, మల్లికార్జున్‌ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి హనుమాన్‌ జయంత్యుత్సవాలు



ముస్తాబైన అభయాంజనేయస్వామి ఆలయం



స్వామివారు

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: స్థానిక తొమ్మిదో వార్డు పరిధిలోని పాలకొండ లో అభయాంజనేయస్వామివారి జయంత్యుత్సవాలు ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు కొనసాగుతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటిరోజు రాత్రి ప్రభోత్సవం, 23వ తేదీ తెల్లవారుజామున 5.30 గంటలకు డోలోత్సవం ఉంటుందన్నారు. 24వ తేదీ తెల్లవారుజామున మూడు గంటలకు రథోత్సవం, అదేవిధంగా అదేరోజు సాయంత్రం నాలుగు గంటలకు శకటోత్సవం ఉంటుందన్నారు. కావున కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఓటుహక్కు ధైర్యంగా వినియోగించుకోవాలి



మల్లెపల్లిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

కోస్గి: ప్రజలు తమ ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవాలని ఎస్‌ఐ శేఖర్‌ గౌడ్‌ సూచించారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని సమస్యాత్మకమైన పీసీ తాండ, బొల్వోన్‌పల్లి గ్రామాల్లో పోలీసులు, కేంద్ర ప్రత్యేక బలగాలతో ఫ్లాగ్‌ మార్చ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసమే పోలీసు శాఖ ఫ్లాగ్‌ మార్చ్‌ నిర్వహిస్తుందని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో మనోధైర్యం కల్పించడంతోపాటు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే పోలీసు శాఖ లక్ష్యంగా ఇలాంటి ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో ప్రత్యేక పోలీస్‌ బలగాలతో పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఆర్‌ఎఎఫ్‌ సిబ్బంది, పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

ఊట్కూరు: పార్లమెంట్‌ ఎన్నికల సందర్భంగా ఆదివారం మండలంలోని మల్లెపల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో కేంద్రసాయుధ బలగాలచే పోలీసులు ఫ్లాగ్‌ మార్చ్‌ నిర్వహించారు. ఈ మేరకు.. ఎస్‌ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ.. సమస్యాత్మక గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రజలకు భద్రతభరోసా కల్పించేందుకు కవాతు నిర్వహించామని తెలిపారు. ఎన్నికల్లో ఓటర్లు స్వచ్ఛందంగా, ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

కాటువేసిన కాలుష్యం

- పరిశ్రమలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు
- వ్యర్థాలతో తాగేందుకు పనికిరాని నీరు
- పట్టించుకోని అధికారులు



పోలేపల్లి సెజ్‌లోని ఓ పరిశ్రమ నుంచి రైతుల పొలాల్లోకి వదులుతున్న కాలుష్యం నీరు(ఫైల్‌)

రాజాపూర్: పరిశ్రమలు వస్తే తమ పిల్లలకు ఉపాధి దొరుకుతుందని అనుకున్నారు. కాని వచ్చిన ఆ పరిశ్రమలే వారి పాలిట యమపాశాలుగా మారాయి. నాడు పచ్చటి పంటలు పండే పొలాలు నేడు పరిశ్రమలు వదులుతున్న కాలుష్యం కారణంగా బీడుభూములుగా మారి తాగటానికి కూడా వ్యవసాయ బోర్లు పనికిరాకుండా పోతున్నాయి. తాము ఉపాధి కోసం సాకుకున్న పాడి గేదెలు, ఆవులతో పాటు మూగజీవాలు కాలుష్యంతో మృత్యువాత పడుతున్నాయి. రాజాపూర్‌ మండలంలోని ముదిరెడ్డిపల్లి శివారులోని పోలేపల్లి శివారులోని సెజ్‌లోని ఫార్మా పరిశ్రమలు ఆమ్నిల్‌, అరబిందో, మైలాన్‌, ఎవర్టోజన్‌ హెల్త్‌కేర్‌, శిల్పా తదితర పరిశ్రమల నుంచి జలం, వాయు కాలుష్యం నుంచి రైతులు విలవిలలాడుతున్నారు. టీఎస్‌ఐఐసీ వారు ఇండస్ట్రీయల్‌ జోన్‌లో పరిశ్రమలు నెలకొల్పారు. కాని పరిశ్రమల నుంచి వదిలే కాలుష్యం నీటిని మాత్రం రైతుల వ్యవసాయ పొలాల్లోకి, సమీప గ్రామాల చెరువుల్లోకి వదులుతున్నారు. ఈ విషయమై రైతులు ఎన్నో పర్యాయాలు సంబంధిత అధికారులకు, కలెక్టర్‌కు, పొల్యూష్‌ కంట్రోల్‌ బోర్డు అధికారులకు విన్నవించినా.. వారి గోడును ఎవరూ పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా చిన్నపాటి వర్షం వచ్చినా.. వర్షం సాకుతో కాలుష్యం నీటిని రైతుల పొలాల్లోకి యథేశ్చగా వదులుతున్నారు. రైతుల వ్యవసాయ బోర్లు కాలుష్యం కావడంతో పాటు ఆ నీరు తాగేందుకు రావడంలేదు. పంటలు కూడా పండవని వ్యవసాయశాఖ అధికారులు సైతం పరీక్షలు నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు.

కలెక్టర్‌ ఆదేశాలు సైతం బేఖాతరు...

రైతులు కలెక్టర్‌ను కలిసి వాస్తవాలను వివరించి, తమకు జరుగుతున్న నష్టాన్ని తెలియజేశారు. అందుకు స్పందించిన కలెక్టర్‌ రవినాయక్‌, ప్రతి నెల వ్యవసాయశాఖ, పశువైద్యశాఖ, గ్రౌండ్‌ వాటర్‌, వైద్యారోగ్యశాఖ, రెవెన్యూ శాఖ, మత్స్యశాఖ భూగర్భ జలశాఖ అధికారులతో ఒక కమిటీని వేసి ప్రతినెల రైతుల పొలాల్లోని బోర్లలోని నీటితో పాటు, అన్ని శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రతినెల నివేదికలు ఇవ్వాలని కలెక్టర్‌ ఆదేశాలు ఇచ్చారు. అయినా అధికారులు పట్టించుకోవడంలేదు.

- రైతులు ఎన్‌జీటీలో కేసు వేయగా.. నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని ఎన్‌జీటీ కోర్టు తీర్పు ఇచ్చినా.. అదికూడా అమలు చేయడంలేదు. పరిశ్రమల నుంచి రైతులకు నష్టం జరుగుతుందని, ఒక్కో పరిశ్రమకు రూ.18 లక్షలకు పైగా జరిమానా వేసినా, పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలను రైతుల పొలాల్లోకి వదులుతున్నారు.

సుక్కనీరు తాగలేకుండ అయిపోయింది



పరిశ్రమల కారణంగా మా బోర్లలోని నీటిని తాగలేకపోతున్నాం. ఆ నీటిని తాగిన పశువులు సచ్చిపోతున్నాయి. పంటలు పండకుండా అయిపోయే. మా గోస ఎవరికి చెప్పుకోవాలి.. ఉన్న చెరువులు, కుంటలు సైతం కాలుష్యం అయ్యాయి.

– పాలెం విఠలయ్యగౌడ్‌, రైతు, రాయపల్లి

ఉపాధి దొరుకుతుందనుకున్నాం..



పరిశ్రమలు వస్తే యువకులకు ఉపాధి దొరుకుతుందని అనుకున్నాం. కాని మా గ్రామం వరకు కాలుష్యం నీళ్లు వస్తున్నాయి. ఉన్న రెండు కుంటల్లోకి కాలుష్యం నీరు వచ్చి చేరింది. చర్మరోగాలు వస్తున్నాయి. దుర్వాసన వస్తోంది. బోర్లు అన్ని ఉప్పునీళ్లు అయిపోయాయి. పైపులు తుప్పుపట్టి పోతున్నాయి. మమ్మల్ని ఎవరూ పట్టించుకోవడంలేదు. – నరిగె నర్సింలు, రైతు